కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

బీడీ కార్మికులను ఆదుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పనికి తగ్గ ఫలితం అందక కుటుంబ పోషణ భారమైన బీడీ కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ్య చర్యలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక సిఐటియు నాయకులతో కలిసి పట్టణంలోని వలిసాబ్ రోడ్, నిజాం వలి కాలనీల్లో పర్యటించి బీడీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఇందులో పని చేస్తున్నా కుటుంబానికి మూడు పూటలా తినడానికి అన్నం పెట్టలేక అప్పుల పాలవుతున్నామన్నారు. అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నామన్నారు. ఆరోగ్యాలు పాడవుతున్నా ప్రభుత్వం గానీ, బీడీ యజమానులు గాని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా కూలి అంతంత మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం బీడీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, ఇల్లు కట్టించాలని, చదువుతున్న పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐటియు నాయకులు తాజుద్దీన్, రామ్మోహన్, జిఎల్ నరసింహులు, ముస్తాక్, బాబ్‌జాన్, ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రికి అనారోగ్యం

◆'పురం'లో రెండేళ్లుగా మూతబడిన ల్యాబ్ ◆మందులు లేవు...సిబ్బంది లేరు ◆కార్మికులకు భారమైన వైద్యం

శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురంలో ఉన్న ఇఎస్ఐ ఆసుపత్రికి జబ్బుచేసింది. రెండేళ్లుగా ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవటంతో ల్యాబ్ మూత పడింది. 406 రకాల మందులు పంపిణీ చేయాల్సుంటే కేవలం 50 రకాల మందులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పోనీ సరిపడా వైద్యులున్నారా అంటే అదీ లేదు. ఇక దీర్ఘకాలిక రోగుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. బిపి కోసం 8 రకాల మందులు రావాల్సి ఉంటే 2 రకాలు, షుగర్ కోసం 6 రకాల మాత్రలు రావాల్సి ఉంటే మూడు రకాలు మాత్రలు సరఫరా చేస్తున్నారు. దీంతో కార్మికులు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేసే స్థోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురంతో పాటు హిందూపురంలో రెండు, గుంతకల్లు, తాడిపత్రిలో ఇఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. ఇక్కడ రోజూ సుమారు 500లకు పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ఎక్కువ మంది వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మంది కార్మికులకు పైగా ఉన్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80వేలకు చేరుకుంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఇఎస్ఐ వాటాను ప్రభుత్వానికి ప్రతి నెల చెల్లిస్తోంది. ఇఎస్ఐ అసుపత్రిలో కార్మికుల కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి ఇఎస్ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం కడపలో ఉంది. 28 డిస్పెన్సరీలు ఆదోని, తిరుపతిలో ఆస్పత్రులు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఇఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. హిందూపురంలో పాటు అనంతపురం, కర్నూల్, కడప జిల్లాలకు ఆదోనిలో ఉన్నా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా అవుతాయి. అయితే గత రెండు సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో మందులు సరఫరా కావటం లేదు.

వేధిస్తున్న మందుల కొరత

మందులు సరఫరా చేసే కంపెనీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవటంతో ఆయా కంపెనీలు ఇఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. మూడు నెలలకు ఓసారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 406 రకాల మందులను డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత తదితర వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం. 406 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు.

మూతపడ్డ ల్యాబ్

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ఉన్న రక్త పరీక్షల విభాగంలో టెక్నిషియన్ ఉన్నారు. అయితే ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా కాకపోవటంతో ల్యాబ్ రెండేళ్లుగా మూత పడింది. అధునాతన యంత్రాలతో దాదాపు 20 రకాల రక్త పరీక్షలను ఇక్కడ నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం హెచ్‌బి పరీక్ష మాత్రమే చేస్తున్నారు. రోగ నిర్ధారణ అయిన అనంతరమే వైద్యులు రోగులకు వైద్య సేవలను అందిస్తారు. అయితే రోగ నిర్ధారణ కోసం కార్మికులు వేలాది రూపాయలు చెల్లించి బయట ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించుకుని వస్తే తప్ప ఇక్కడ వైద్యం అందడం లేదు.

మందులే కాదు సిబ్బంది సైతం లేరు...

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ముందులే కొరతే కాదు సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. హిందూపురం, కొట్నూరు రెండు డిస్పెన్సిరీలు ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికి నర్సింగ్, ల్యాబ్ టెక్నిషియన్, ఎంఎన్ఒతో పాటు క్లాస్-4కు సంబందించి అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సి సీనియర్ అసిస్టెంట్లు సైతం లేరు. దీంతో రోగులతో పాటు వైద్యులు ఇబ్బంది పడుతున్నారు.

కార్మికులకు భారంగా వైద్యం

చాలా మంది కార్మికులు అరకొర వేతనాలు, సంపాదనతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వారిలో ఎవరికైనా ఏదైనా జబ్బుచేస్తే ఇఎస్ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. అయితే ఇఎస్ఐ డిస్పెన్సరీలో కూడా మందులు కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మందులు, ఇంజెక్షన్ల కోసం నెలకు సుమారు రూ.2 నుంచి రూ.3 వేల విలువ చేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సుంటుంది. అయితే ఇప్పుడు ఇఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు గడిచిన మంజూరు కావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ అసుపత్రుల్లోఇఎస్ఐ కార్డు ఉన్నా వారికి వైద్య సేవలు అందించమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. దీనికి కారణం ఇఎస్ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాక పోవడమేనని తెలుస్తోంది. ప్రతి నెల కార్మికులు ఇఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికి వైద్య సేవల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది.

నిరుపయోగంగా మూలన పడేసిన ల్యాబ్ పరికరాలు

సౌకర్యాలు మెరుగుపర్చాలి

జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఇఎస్ఐ అసుపత్రి. ఈ అసుపత్రిలో మందులే కాదు..సిబ్బంది సైతం లేక కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. అలాగే రక్త పరీక్షల కోసం అవసరమైన కెమికల్స్, కిట్స్‌ను సరఫరా చేసి ల్యాబ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతాం.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా కార్యదర్శి

అక్రమార్కులపై ఉక్కు పాదం....

డిఎస్‌పి కంజాక్షన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ డివిజన్ వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాం... నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి సారించాం.. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉక్కుపాదం మోపుతాం.. ప్రజలు మెచ్చుకునేలా సేవలు అందిస్తామని హిందూపురవ డిఎస్‌పి కంజాక్షన్ అన్నారు. ప్రజాశక్తితో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఎలాంటి సహకారం అందుతుంది?

జవాబు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధితులు స్టేషన్‌కు వచ్చిన 15 నిమిషాల్లో ఆయా స్టేషన్లలో తమ సిబ్బంది వారితో మాట్లాడుతున్నారు. అక్కడ ఎవరూ లేకపోతే నేరుగా జిల్లా ఎస్పీకి సెల్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. ఎక్కువగా కుటుంబ సమస్యలు, ఆస్తి, భూతగాదాలతో బాధితులు స్టేషన్లకు వస్తున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

ప్ర: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జ: డివిజన్ వ్యాప్తంగా హిందూపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉంది. ట్రాఫిక్ సిబ్బందితో సివిల్ పోలీసులు సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారానికి చొరవ చూపుతాం. అదనంగా సివిల్ సిబ్బందిని ఇందుకు కేటాయిస్తాం. జిల్లాలోనే హిందూపురం పట్టణం అతి పెద్దది కావడంతో ప్రజల రాకపోకలు అధికంగా ఉండటం, విఐపి పర్యటనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. పొరపాటున ప్రమాదం చోటుచేసుకున్నా వెంటనే సాధ్యమైనంత వరకు ప్రాణాలు కాపాడేలా ప్రయత్నం చేస్తాం.

డిఎస్‌పి కంజాక్షన్

ప్ర: అక్రమాలు అరికట్టడంపై ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: సబ్ డివిజన్ పరిధిలో అవినీతి, అక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. అవినీతికి పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించం. దీంతో పాటు నిషేధిత పదార్థాలు విక్రయించినా, నిషేధిత పందేలు ఆడినా చర్యలు తీవ్రంగా ఉంటాయి. అక్రమాలపై డయల్ 100కు సమాచారం అందించాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం. ప్రజలు తమకు అన్ని విధాలా సహకరించాలని ప్రజలను కోరుతున్నాం.

ప్ర: ఇటీవల చోరీలు పెరుగుతున్నట్లు అనిపిస్తోంది. వీటి కట్టడి పై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: సబ్ డివిజన్ పరిధిలో చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దీనిపై ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా, లేదంటే ప్రత్యేక బృందం ద్వారా ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఫలితంగా చోరీలు జరగకుండా ఉంటాయి. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లినా పక్కింటి వారిని గమనిస్తుండమని చెప్పడం మేలు.

ప్ర: యువత ఎక్కువగా పెడదోవపడుతున్నారు? అలాంటి వారిని కట్టడి చేయడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ: 18 నుంచి 25 వయస్సు మధ్యలో ఉన్న యువత మద్యానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. పలుచోట్ల ఘర్షణలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని పలు ప్రదేశాలను గుర్తించాం. రైల్వేస్టేషన్ సమీపంతో పాటు పలు ప్రాంతాలపై నిఘా ఉంచాం. అటువైపు మద్యం సేవించడం తదితర కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం.

ప్ర: అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వాలంటే కొందరు భయపడుతున్నారు? తమ వివరాలు బయటకు చెబుతారనే అపనమ్మకంతో ఉన్నారు...

జ: అసాంఘిక శక్తులపై సమాచారం అందించడం పౌరధర్మం. వారికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదు. 100కు ఫోన్ చేసి చెప్పవచ్చు. లేదంటే చిన్న లేఖ రాసినా సరిపోతుంది. అలాంటి వారు నేరుగా మా కార్యాలయానికి వచ్చి సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

ప్ర: నిఘా వ్యవస్థపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: సబ్ డివిజన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థ గాడి తప్పింది. యుద్ధ ప్రాతికపదికన వాటికి మరమ్మతులు చేయించి చోరీలు, గొడవలు, దొమ్మీలను అడ్డుకుంటాం. గతంలో కొన్ని భారీ దోపిడీలను సీసీ కెమెరాల ద్వారానే ఛేదించాం. ఇకపై సీసీ కెమెరాలను అందుబాటులోకి తెచ్చి అనుక్షణం వాటిని పర్యవేక్షించేలా బృందాన్ని ఏర్పాటు చేస్తాం. చోరీ చేయాలంటే భయపడేలా చేస్తాం.

ప్ర: సైబర్ నేరాల నిరోధానికి కార్యాచరణ ఎమి..?

జ: ప్రజలు ఎంత చదువుకున్నా, తెలివిగా ఉన్నా కొందరు నేరస్తులు బురిడీ కొట్టించే ప్రయత్నంలోనే ఉన్నారు. అలాంటి వారి నుంచి ప్రజలను కాపాడే బాధ్యత పోలీసులదే. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తాం. సైబర్ నేరాలపై దృష్టి పెడతాం. ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి చాలామంది డబ్బులు పోగొట్టుకున్నారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు మున్ముందు ఇలాంటివి చోటుచేసు కోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

అధికార దర్పం

వైసిపి ర్యాలీతో 'అనంత' బ్రిడ్జి ప్రారంభం

రెండు రోజులు తరువాతే వాహనాలకు అనుమతి

నిర్మాణ సంస్థ ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైన ప్రభుత్వపరంగానే చేపట్టడం ఆనవాయితీ. అయితే అనంతపురం నగరంలో మాత్రం నూతనంగా నిర్మిస్తున్న టవర్ క్లాక్ బ్రిడ్జి ప్రారంభం మాత్రం అధికారపార్టీ కార్యక్రమంతో ప్రారంభమవడం చర్చనీయాంశమవుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల కావస్తున్న సందర్భంగా వైసిపి కార్యక్రమంలాగా స్కూటర్ ర్యాలీతో ఈ బ్రిడ్జి ప్రారంభించడం చర్చనీయాంశమవుతోంది.

రెండు రోజుల తరువాత రాకపోకలకు అనుమతి

నగరంలోని బళ్లారి బైపాస్ వద్ద ఎన్‌హెచ్44 నుంచి పంగల్ రోడ్డు వరకు 9.2 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మాణాన్ని రూ.198 కోట్లతో చేపట్టారు. గతేడాది 2022 అక్టోబరులో పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 2023 అక్టోబర్ నాటికి పనులు పూర్తికావాల్సింది. అయితే నిర్మాణ సంస్థ వేగంగానే పనులు చేపట్టింది. నిర్ణీత సమయానికి కంటే ముందే పనులు ముగించే విధంగా పనులు సాగాయి. ఇందులో ప్రధానమైనది అనంతపురం నగరం నడిబొడ్డున టవర్‌క్లాక్ వద్దనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి. దీని నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిని ప్రారంభించాలన్న ఒత్తిడి కూడా నగరవాసుల నుంచి ఉంటోంది. ఎందుకంటే నగరం రెండు వైపులా కలిపే ప్రధానమైన బ్రిడ్జి ఇదే. అయితే ఈ బ్రిడ్జి ప్రారంభ సమయం కూడా ఆసన్నమైంది. సోమవారం ఉదయం ప్రారంభించాలని అనధికారిక ప్రకటన ఒకటి వెలువడింది. అయితే అధికారులెవరూ ఈ ప్రకటన చేయకపోవడం గమనార్హం. వైసిపి నేతలు మాత్రం నాలుగేళ్ల వైసిపి పాలన పూర్తయిన సందర్భంగా ఈ బ్రిడ్జిపై స్కూటర్ ర్యాలీ చేపట్టి అనధికారికంగా ప్రారంభించేయనుండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో అధికారులెవరూ కూడా లేకపోవడం గమనార్హం. ఈ ర్యాలీ తరువాత వెంటనే ఇతర వాహనాలకు అనుమతి లేదని నిర్మాణ సంస్థ అయిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఒక ప్రకటన విడుదల చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్నందున రెండు రోజుల పాటు వాహనాలకు అనుమతిలేదని, జూన్ ఒకటవ తేదీ నుంచి అనుమతి ఉంటుందని చెప్పింది. ఈ మొత్తం వ్యవహారంలో అధికారులు మాత్రం ఎటువంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. బ్రిడ్జి కింద అండర్ పాస్ నిర్మాణం కూడా పూర్తయ్యాక అధికారిక ప్రారంభముంటుందని చెబుతున్నారు.

ప్రధాన రహదారుల విస్తరణ అంతేనా ?

ఎన్‌హెచ్ 44 నుంచి పంగల్ రోడ్డు వరకు విస్తరణ చేపట్టే యోచనతో ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు బళ్లారి బైపాస్ నుంచి టవర్ క్లాక్ బ్రిడ్జి కూడా నాలుగు వరుసలతో నిర్మాణం చేపట్టారు. సప్తగిరి సర్కిల్ వరకు ఈ రకంగా నిర్మాణం చేపట్టారు. సప్తగిరి సర్కిల్ నుంచి ఐరన్ ఓవర్ బ్రిడ్జి మధ్య విస్తరణకు మార్కింగు ఇచ్చారు. కాని ఇక్కడున్న నిర్మాణాలు తొలగించాలంటే పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సుమారు రూ.80 కోట్ల నిధులు అవసరమయ్యాయి. ఈ నిధులు రాకపోవడంతో ఉన్న రహదారుల్లో కొత్త రోడ్డు వేసి మమ అనిపించే ప్రయత్నం చేస్తున్నారు. సప్తగిరి సర్కిల్ విస్తరణ చేపడతామని అందుకు రూ.25 కోట్లు అవసరమవతాయని అధికారులు అంటున్నారు. అయితే ఆ నిధులు కూడా వస్తాయా అన్నది మాత్రం సందేహాస్పదంగానే మారింది. మొత్తం మీద అధికార వైసిపి అనధికారికంగా వంతెన ప్రారంభించనుంది.

ప్రారంభానికి సిద్ధం చేసిన నగరంలోని టవరక్లాక్ బ్రిడ్జి

జీవో 47లోని అసంబద్ధాలను సరిచేయాలి : ఫ్యాప్టో

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జీవోనెంబర్ 47లోని అసంబద్దాలను సరిచేయాలని ఫ్యాప్టో అనంతపురం జిల్లా ఛైర్మన్ ఎస్. సిరాజుద్దీన్, శ్రీ సత్య సాయి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా ఆదివారం జిల్లాకేంద్రంలోని సైన్స్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి డివైఈవో పద్మప్రియకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మే 17న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో అన్ని రకాల ఉపాధ్యాయ పదోన్నతులు మాన్యువల్ గా జరుపేందుకు హామీ ఇచ్చారన్నారు. అయితే ఇచ్చిన హామీకి భిన్నంగా ఉపాధ్యాయుల ప్రమోషన్లు ఆన్‌లైన్‌లో జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఖాళీలు ఎక్కడ ఉన్నాయో చూపకుండా ప్రమోషన్లు వద్దనుకునే వారు రాతపూర్వకంగా అన్ విల్లింగ్ తెలపాలని ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ప్రస్తుతం పదోన్నతులు ఇచ్చే ప్రక్రియ గతంలో దానికి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని అన్నారు. 2022 జూలైలో ఒకసారి 2022 జనవరిలో మరొకసారి ప్రమోషన్లు ఇస్తామని ఉపాధ్యాయుల నుండి విల్లింగ్ తీసుకుని ప్రమోషన్ల వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని అది తేలిన తర్వాత ప్రమోషన్లు ఖరారు చేస్తామని నమ్మించి రూ.2500 అలవెన్స్ తో నాలుగు నెలలు పాటు పని చేయించుకున్నారని విమర్శించారు. తిరిగి మొత్తం ప్రమోషన్ కౌన్సిలింగ్ రద్దుచేసి అందరికీ నిరాశ కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఎలాంటి ఖాళీలు చూపకుండా విల్లింగ్ ఇచ్చిన వారికే ప్రమోషన్లు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారని అది కూడా ఇంతవరకు . షెడ్యూల్‌ను కూడా ప్రకటించలేదని మండిపడ్డారు. అధికారుల ధోరణి వల్ల అనేకమంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారని అన్నారు. ఏ ఖాళీలను బ్లాక్ చేయరాదని బదిలీల జీవోలోని ఉన్న అసంబద్దాలను సవరించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి. లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణరెడ్డి, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, నాయకులు బి. నరసింహులు, గోపాలరెడ్డి, సూర్యుడు, జి. వెంకటేష్,నాగేంద్ర, విశ్వనాథరెడ్డి,రత్నం, అనిల్, చంద్ర,దేశాయ్ నాగరాజు,సర్దార్‌వలి, ఎర్రిస్వామి, శివ శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిరణ్మయితో అసోసియేషన్ ప్రతినిధులు

అండర్-16 బాస్కెట్‌బాల్ శిబిరానికి ధర్మవరం బాలిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జాతీయ స్థాయి అండర్-16 బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ధర్మవరం పట్టణానికి చెందిన బాలిక కిరణ్మయి ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజిం గ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. కిరణ్మయిని ఆదివారం అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ అజయ్, ఆత్మీయ ట్రస్టు వైస్ ఛైర్మన్ సూర్యప్రకార్‌రెడ్డి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఇండియా జట్టుకు మే 31 నుంచి జూన్ 6 మధ్య చత్తీస్‌ఘఢ్‌లో క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. దీనికి కోసం ప్రాబబుల్స్ టీంను ప్రకటించగా కిరణ్మయికు చోటు దక్కిందన్నారు. అనంతరం కిరణ్మయికి ఆత్మీయ ట్రస్టు తరపున రూ. 5 వేలను అందజేశారు.

మున్సిపల్ తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపాలిటీ తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా ప్రస్తుత వైస్ ఛైర్‌పర్సన్ భాగ్యలక్ష్మిని నియమిస్తూ ఈ నెల 26వ తేదీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. నూతన శాశ్వత ఛైర్‌పర్సన్ ఎన్నిక జరిగేంత వరకూ భాగ్యలక్ష్మి ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతారన్నారు. ఇది వరకూ ఉన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల రాజీనామా చేయగా కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదించారు.

నేటి నుంచి విత్తనవేరుశనగ పంపిణీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం(నేటి) నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారని ఏవో ఇలియాజ్ అహ్మద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. విత్తనం వేరుశనగ కోసం ఆర్‌బికెలలో రిజిస్టర్ చేసుకొని డబ్బు చెల్లించిన ప్రతి రైతుకూ విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. కావున రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. నమోదు చేసుకోని రైతులు ఆధార్ కార్డు జిరాక్సు, మొబైల్ ఫోన్, పట్టాదారు పాసుబుక్ జిరాక్సు రైతు భరోసా కేంద్రంలో చూపించి విత్తనం పొందవచ్చు అన్నారు.

బత్తలపల్లి: ఆర్‌బికెలలో సోమవారం(నేటి) నుంచి విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తారని ఏఓ ఓబిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నమోదు చేసుకున్న రైతులకు ఆయా ఆర్‌బికెలలో విత్తన కాయలు అందిస్తామన్నారు.

నర్సింగ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

బైరాపురం గ్రామానికి చెందిన వర్షినిని కాలేజీ యాజమాన్యం మానసికంగా వేధించడం వల్లనే ఆత్మహత్య చేసుకుందని, ఆమె మృతికి కారణమైన అనంతపురంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ మండల కన్వీనర్ శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం బైరాపురం గ్రామానికి వెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించి విద్యార్థిని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శిస్తున్న శివప్రసాద్

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ఎఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత

ప్రజాశక్తి-హిందూపురం

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రెజ్లర్ల ఉద్యమానికి సంఘీభావంగా ఎఐఎంఎస్ఎస్, ఎఐడిఎస్ఓ, ఎఐడివైఓ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరగకపోతే భవిష్యత్తులో సామాన్య ప్రజలకు, స్త్రీలకు భద్రత ఎక్కడ ఉంటుందన్నారు. రెజ్లర్ల ఉద్యమానికి మద్దతు ఇస్తున్న మహిళా సంఘాల నాయకురాళ్లను అరెస్టులు చేయడం, బెదిరించడం, దాడి చేయడం లాంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఎఐడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్ లాంటి వారిని శిక్షించకపోతే భవిష్యత్తులో పిల్లలను క్రీడారంగంలోకి పంపించలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి హారతి ఇస్తున్న దృశ్యం

మైనార్టీల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పెనుగొండ రహదారిలో ఉన్న షాదీఖానా ప్రారంభోత్సవం, నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి మైనార్టీల అభివద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. పార్టీలు, మతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. మైనార్టీల షాదీ ఖానా మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి రూ. 35 లక్షలు మంజూరు చేయించామన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో షాదీఖానా పనులను త్వరితన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరగా 15 రోజు ల్లోపు రెండెకరాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను మైనార్టీలు సన్మానించగా ఆయన కమిటీ అధ్యక్షుడిగా జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా తయ్యబ్, కమిటీ సభ్యులు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు షాజహాన్, దర్గా కమిటీ మేనేజర్ అతావుల్ రెహ్మాన్, ఎంపీటీసీ రఫీ, జిల్లా అగ్రి అడ్వైజర్ బోర్డు ఛైర్మన్ రమణారెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, మాజీ జడ్పిటిసి గఫాం, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

మతసామరస్యం పాటించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జాబిలి చాంద్ బాషా

దేశంలో మతసామరస్యం, పర్యావరణం, దేశభక్తి ఈ మూడు అంశాలపై అభ్యుదయ వాదులు, మేధావులు పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని సాయి ఆరామం అతిథి గహంలో ఆదివారం రచయితలు, పర్యావరణ వేత్తలతో సమావే శం జరిగింది. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్య, లౌకిక దేశంలో మతసామరస్యం పాటించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మతకల్లోలాలు, ఉగ్రవాదం పెరిగిపోతున్నాయని, దీంతో దేశం అస్తవ్యస్తంగా మారకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు జిల్లా రచయితల సంఘం తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే పెనుగొండలో మతసామరస్యం, పర్యావరణం, దేశభక్తిని తెలిపే మిలాన్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ప్రముఖ రచయితల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఫారుఖ్ ఖాన్, కల్లూరు రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివన్న, పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల రైతులను ఆదుకోండి

మాజీ ఎమ్మెల్యే సూరి

ప్రజాశక్తి-బత్తలపల్లి

దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న గోనుగుంట్ల

ప్రకతి వైపరీత్యాలు, గాలివాన బీభత్సానికి పూర్తిగా నష్టపోయిన పండ్లతోటల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాల్లో ఈదురుగాలుల ధాటికి నష్టపోయిన అరటి, బొప్పాయి తోటలను ఆదివారం ఆయన పరిశీలించి బాధిత రైతు లు బోయపాటి లక్ష్మీనారాయణ, నెట్టెం వెంకటేష్, తదితర రైతుల నుంచి పంట నష్టం వివరా లు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లక్షలాది రూపా యలు ఖర్చు చేసి పంటలు సాగు చేశారన్నారు. దిగుబడి చేతికందే సమయంలో ప్రకతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయారని, కావున ప్రభుత్వం వెంటనే బాధిత రైతులకు నష్ట పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత రైతులను ఓదార్చారు. అనంతరం బాధిత రైతు బోయపాటి రామాంజనేయులకు తక్షణ సహాయంగా రూ. 20వేలు అందజేశారు.

నర్సరీ రైతులను ఆదుకుంటాం : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ఈదురుగాలులు, విద్యుత్ లైన్లు తెగిపడి నష్టపోయిన నర్సరీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బత్తలపల్లిలో గాలివాన ధాటికి నర్సరీ పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు విద్యుత్ లైన్లు తెగిపడడంతో మొక్కలు పూర్తిగా నష్టపోయారు. అలాంటి నర్సరీలను ఆదివారం ఆయన పరిశీలించి యజమానులతో నష్టం వివరాలను తెలుసుకున్నారు. నర్సరీ యజమానులను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ వీరనారప్ప, బోయపాటి ఈశ్వరయ్య, మంజునాథ్, తదితరులు ఉన్నారు.

వాహన కాలుష్యాన్ని నివారిద్దాం

వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారి ప్రసాద్

బత్తలపల్లి : కాలుష్య కోరల నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడదామని కదిరి రవాణా శాఖ ఎంవిఐ ఎంవి ప్రసాద్ వాహనదారులకు సూచించారు. బత్తలపల్లిలో ఆదివారం వాహనదారుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ కాలుష్యం కోరలు చాస్తోందన్నారు. పర్యావరణానికి హానికరంగా తయా రవుతున్న కాలుష్యం వల్ల మనుషులకు అనేక రోగాలు వస్తున్నాయన్నారు. కాలుష్యం వల్ల చిన్న వయస్సుకే జీవితం చాలించాల్సి వస్తోందన్నారు. కాలం చెల్లిన వాహనాలతో మరింత ఎక్కువగా వాతావరణం కాలుష్యమవుతోం దన్నారు. వాహనదారులు తమ వాహ నాలకు ఎప్పటికప్పుడు కాలుష్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, కండీషన్‌లో లేని వాహనాలను వాడవద్దన్నారు. అనంతరం వాహనదారులతో కాలుష్య నివారణకు పాటుపడదా అని ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగు వారి గుండెల్లో నందమూరి తారక రామారావు ఎప్పటికీ చిరస్మరణీయులు అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణ టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు స్థానిక నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అలాగే అన్నా భోజనశాల, ఆరోగ్య రథంలో సేవలందించిన వారికి సన్మానం చేసి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు షఫివుల్లా, రామాంజనమ్మ, నాయకులు నాగరాజు, పామిశెట్టి చంద్రశేఖర్, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు జేపీ కే రాము, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు శివ శంకర్, పార్లమెంట్ తెలుగు మహిళా కార్యదర్శి చెన్నమ్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి దాదా ఖాన్, ఐటిడిపి తెలుగు యువత మైనార్టీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం అభిమానులు, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు వృద్ధులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ అభిమానులు పోస్టల్ అల్లా, ప్రకాష్ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ పుట్టపర్తి మండల అధ్యక్షుడు షామీర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్యసాయి అనుగ్రహ వృద్ధాశ్రమంలో పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ వార్డెన్ రామప్ప, అభిమానులు శ్రీకాంత్, శ్రీనివాసులు, సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అలాగే కేకు కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాల అభివద్ధికి కషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, పురుషోత్తం గౌడ్, గొట్లూరు శీన, మేకల రామాంజనేయులు, అంబటి సనత్‌కుమార్, శీలామూర్తి, చిత్రా రామ్మోహన్, గోసల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజమండ్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి ధర్మవరం టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, పరిసే సుధాకర్, కృష్ణాపురం జమీర్ అహ్మద్, టైలర్ కుళ్లాయప్ప, మారుతిస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు.

బత్తలపల్లి : ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు పోటాపోటీగా వేర్వేరుగా నిర్వహించారు. తొలుత శ్రీరామ్ అభిమానులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం ఆర్డీటీ ఆసుపత్రి వద్ద రోగులు, వారి బంధువులకు తెలుగు యువత నాయకులు జొన్నలగడ్డ రంగానాయుడు, తల్లూరు సతీష్ కుమార్ చౌదరి, తరిగోపుల చౌదరి, ముళ్లగూరు సతీష్, తదితరులు అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి పరిటాల సునీత జన్మదినం సందర్భంగా గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, గోనుగుంట్ల నారాయణరెడ్డి, తదితరులు ఆమెకు పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి సురేంద్ర నాయుడు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్ల శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి రవి, జక్కంపూడి నాగభూషణం, చిదంబరెడ్డి, జొన్నలగడ్డ రంగానాయుడు, తదితరులు పాల్గొన్నారు. సూర్యనారాయణ అభిమానులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్, కట్ చేసి ఎన్టీఆర్ అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వీరనారప్ప, బోయపాటి ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ రామోహన, ఓబుల్ నాయుడు భాస్కరప్ప, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండల పరిధిలోని రొద్దం, పెద్దమంతూరు, పి.రొప్పాల గ్రామాల్లో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా నాయకులు కేక్ కట్ చేయడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్దమంతూరులో పెనుకొండ నియోజకవర్గ బిసి సెల్ అధికార ప్రతినిధి జి.రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. తురకలాపట్నంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పులహారం వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

రొద్దంలోఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి శ్రేణులు

కార్యక్రమంలో నాయకులు రాము, రామాంజి, వెంకటరమణప్ప, శ్రీరాములు, ఓబుళ నరసిం హప్ప, అంజనప్ప, డీలర్ కిష్టప్ప, అదినారాయణ, పెద్దమూర్తి, వెంకటరమణప్ప, సంజీవన్న, శ్రీరాములు, శంకరప్ప, జగదీష్, శేషాపురం మారుతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు. దొడగట్టలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామచంద్ర, దుర్గప్ప, జయప్ప, రామకృష్ణ ధర్మాపాల్, రామాంజి,, తిప్పన్న, హనుమంత, వెంకటేష్ శేషప్ప, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి వర్గీయులు, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప వర్గీయులు పోటాపోటీగా నిర్వహించారు మొదట కిష్టప్ప తనయుడు అంబరీష్, మాజీ సర్పంచి నిమ్మల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్దకు చేరుకొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అన్నదానం ఏర్పాటు చేశారు. గంట తర్వాత బికె వర్గీయులు మం డల కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు వేణు, జయరాం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నిమ్మల శ్రీధర్, దాసయ్య, మరిరెడ్డిపల్లి నరసింహులు, లక్ష్మీ నారాయణ, గంగంపల్లి నరసింహులు, నాగరాజు, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు : కొత్త చెరువులో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బుక్కపట్నం రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి బాణసంచా పేల్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వాణి మాట్లాడుతూ ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాలకు ఎంతో సేవ చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంత రం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి హరినాథ్ చౌదరి, టిడిపి నాయకులు పివి జయప్రకాష్, టౌన్ కన్వీనర్, వలిపి శ్రీనివాసులు, పీవీ శివప్రసాద్, మారుతి రెడ్డి, సైకిల్ షాపు బాబా, తదితరులు పాల్గొన్నారు

కనగానపల్లి : మండలంలో ఎన్టీఆర్ జయంతి, పరిటాల సునీత జన్మదినం కార్యక్రమాల ను ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలు గు యువత అధ్యక్షులు బట్ట సురేష్ చౌదరి, మాదినేని సుధాకర్, ముస్కిన్, సాకే పోతలయ్య, బద్దలాపురం శంకర్, బీరన్న, గడ్డం బూసి, వసంత్, శ్యామ్, శివ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మడకశిర : టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుండుమల రాధాకష్ణ, పట్టణ అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్ ఉమాశంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పుల్లయ్యచౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు నాగరాజు, కన్నా, తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, తదితరులు హాజరయ్యారు.

రామగిరి : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాల వేసి స్మరించుకున్నారు. అనంతరం మాజీ మంత్రి పరిటాల సునీతమ్మ జన్మదినం సందర్భంగా మండల నాయకుల ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు. కార్యక్రములో తెలుగు యువత మండల అధ్యక్షులు ఎల్.శ్రీధర్‌నాయుడు, మైనారిటీ అధ్యక్షులు దాదాపీరా, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, మాజీ సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు...

పెనుకొండ : ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని సవితమ్మ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, ఎన్టీఆర్ అమర రహే అంటూ నినాదాలు చేశారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహానికి పులమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు యాదవ్, గుట్టూరు సూర్యనారాయణ, తోటగేరి సుబ్రహ్మణ్యం, కోనాపురంకేశవయ్య, వెంకటేష్, మల్లికార్జున, మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారధి తరపున ఆయన అల్లుడు శశిభూషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొక్కసంపల్లి రామకృష్ణప్ప, జిల్లా యాదవ సాధికార కన్వీనర్ కేశవయ్య, పాలడుగు చంద్రశేఖర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మినారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవి శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలోఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి శ్రేణులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 1983-85లో చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని సిబిఎన్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మృతిచెందిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం అప్పటి గురువులు నాగరాజారావు, నారాయణ రెడ్డి, విద్యాసాగర్, బాబయ్య, సంజీవప్ప, ఊకా అశ్వర్థనారాయణ, రామ్మోహన్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

గోరంట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1976-77లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమ య్యారు. ఈ సంద ర్భంగా వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కష్ట సుఖాలను తెలుసుకుంటూ ఆనం దంగా గడిపారు. అప్పటి గురువులు శంకరనారాయణ, వెంకటరెడ్డి, రఘురామిరెడ్డిలను ఘనంగా సన్మానించారు.

బుక్కపట్నం: స్థానిక సత్యసాయి జిల్లా పరిషత్ ఉన్నత హైస్కూల్‌లో 1993 - 1998 వరకు పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది హాజరయ్యారు. వారు మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అప్పటి గురువులతో ఆనందంగా గడిపారు. అప్పటి ప్రధానోపాధ్యా యులు వెంకటరామయ్య, ఉపాధ్యాయులు వెంకన్న, ఏఎల్ఎన్ మూర్తి, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేణు, మల్లమ్మలకు పాదాభివందనాలు చేసి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు.

ధర్మవరంలో అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

మోహిత్ సూర్య

అమరాపురం : ఉన్నత చదువుల కోసం బెంగళూరుకు పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరించడంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని హలుకూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. హలుకూరు గ్రామానికి చెందిన విఆర్ఏ కుమారుడు మోహిత్ సూర్య(16) ఇంటర్మీడియట్ పాసయ్యాడు. ఉన్నత చదువుల కోసం బెంగళూరుకు వెళ్తానని ఇంట్లో తెలిపాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని ఇక్కడే ఏదైనా కళాశాలలో చేరాలని తల్లి సూచించింది. దీంతో మనస్థాపానికి గురైన మోహిత్‌సూర్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదన్న మనస్థాపంతో..

సాయికుమార్ రెడ్డి

పరిగి : ఉద్యోగం రాలేదని మనస్థాపం చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘ టన ఆదివారం స్థానిక సాయినగర్‌లో చోటుచేసు కుంది. వివరాలు.. సాయికుమార్‌రెడ్డి బెంగళూరు లో ఎంబీఏ పూర్తి చేసి రెండుళ్లుగా ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకపోయింది. దీంతో ఇటుక బట్టీ బిజినెస్ చేసుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. అయినప్పటికీ ఉద్యోగం రాలేదని మనస్థాపానికి గురైన సాయి శనివారం రాత్రి 12 గంటల సమయంలో బెడ్రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 8 గంటలైనా నిద్ర లేయకపోవడంతో కుటుంబ సభ్యులు గదిలోకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అలాగే తండ్రి సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

దాదులూరు వద్ద రోడ్డు ప్రమాదం

ప్రమాదానికి గురైన కారు

కనగానపల్లి : మండల పరిధిలోని దాదులూరు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఓ కారు డివైడర్‌ను ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి అనంతపురం వస్తున్న కారు దాదులూరు సమీపంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో కారు మొత్తం డ్యామేజ్ అయింది. కారులో ఉన్న బెలూన్స్ తెరుచుకోవటంతో అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని స్థానికులు బయటకు తీసి వేరే వాహనంలో అనంతపురం పంపించారు.

ఎన్టీఆర్ శతజయంతి పురస్కరిం చుకుని కేకు కోస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేదల పెన్నిధి, బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు అని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ శతజయంతి పురష్కరిం చుకుని ఆదివారం ఆయన పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టి కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్లతో పెకలించిన మహనీయుడన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ నినా దంతో అనేక సంక్షేమ పథకాలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ల్లో రాజకీయచైతన్యం కల్పించిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిగిచెర్ల అరవిందరెడ్డి, డిష్ రాజు, తుంపర్తి పరమేశ్, గొట్లూరు చంద్ర, చిలకం సూర్యనారాయణరెడ్డి, బోడగల గిరిధర్, బోయలపల్లి సుజాత, పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, ఆరీఫ్‌ఖాన్, నిజాం షాను, సౌదీ నాగరాజు, మహబూబ్ బాషా, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం నిరంతరం కషి చేద్దామని మాజీ జడ్పిటిసి రత్నమ్మ నరసింహమూర్తి పేర్కొన్నారు. టిడిపి మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జయరాం, మాజీ ఎంపీపీ కష్ణమూర్తి, మీనాక్షి రామిరెడ్డి, హిందూపురం పార్లమెంట్ సభ్యులు రఘు యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నవీన్‌కుమార్, చలపతి, తదితరులు పాల్గొన్నారు

క్వారీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి గ్రామంలో క్వారీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నిడిమామిడి గ్రామ ప్రజలు క్వారీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై గ్రామసభలు పెట్టి ఏర్పాటు చేస్తామనడం ఎంతవరకూ సమంజసమన్నారు. స్థానికులే అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటే మళ్లీ గ్రామసభలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. పర్యావరణ కాలుష్యం, ప్రజలకు అనారోగ్యంతో పాటు పాఠశాల విద్యార్థులకు, పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలో అనేక సమస్యలు తలెత్తుతాయని చెప్పినా ఏమాత్రం పట్టించుకోకుండా క్వారీలు ఏర్పాటు చేయడానికి అధికార యంత్రాంగం పూనుకుంటుందని దీన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాభిప్రాయం ప్రకారం క్వారీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముందు ఆ గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఘనంగా పరిటాల సునీత జన్మదిన వేడుకలు

ధర్మవరం టౌన్ : మాజీ మంత్రి పరిటాల సునీత ఆదివారం రాజమండ్రిలో ధర్మవరం టీడీపీ నేతలతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు చింతలపల్లి మహేశ్ చౌదరి, ఫణికుమార్, పోతుకుంట లక్ష్మన్న, రాంపురం శీన, పఠాన్ బాబూఖాన్, బొట్టు కిష్ట, కేశగాళ్ల శ్రీనివాసులు, చిన్నూరు విజయ్‌చౌదరి, కరణం ప్రభాకర్, రేగాటిపల్లి నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి సారూ..

తనకల్లు : స్థానిక తారకరామనగర్‌లో 40 కుటుంబాలతో పాటు రెండు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. అయితే వారానికోసారి తాగునీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించు కున్నా ఫలితం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో పశువులు, గొర్రెలు, మేకల దాహార్తి తీర్చేందుకు వాటి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని తారకరామనగర్ ప్రజలు కోరుతున్నారు.